స్కేటింగ్ విజేతకు కలెక్టర్ అభినందన

ప్రజాశక్తి - కాకినాడ

మైసూర్‌లో గత నెల 10వ తేదీన జరిగిన 62వ జాతీయ రోలర్ స్కేటింగ్ చాంపియన్ షిప్ పోటీలో రజిత పతక విజేత తూరంగి గ్రామానికి చెందిన అరదాడి మహీధర రాజ్‌కుమార్‌ను కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మట్లాడుతూ రాజ్ కుమార్ జాతీయ స్థాయిలో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం అన్ని రకాలుగా సహకరిస్తుందని కలెక్టర్ తెలిపారు. జిల్లా స్పోర్ట్స్ అధికారి బి.శ్రీనివాసరావు, తూరంగి స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, విజేత తండ్రి అరదాడి సత్తిబాబు, అల్లూరి సీతారామరాజు కాలనీ నివాసి చింతపల్లి అజయ్‌కుమార్, కురుపూడి వీరబాబు విజేత రాజ్ కుమార్‌కు అభినందనలు తెలిపారు.

ఎంఎల్‌సి ఎన్నికల నగారా

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

తూర్పు, పశ్చిమ ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల నగారా మోగింది. బుధవారం దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. దీంతో ఒక్కసారిగా ఎన్నికల కోలాహలం ఊపందుకుంది. ఫిబ్రవరి మూడో తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. పదోతేదీ వరకూ నామినేషన్ల స్వీకరణ కొనసాగనుంది. 13వ తేదీతో ఉపసంహరణ ముగియనుంది. 27వ తేదీన ఎన్నికల పోలింగ్, మార్చి మూడో తేదీన ఎన్నికల కౌంటింగ్ జరనుంది. ఉభయ గోదావరి జిల్లాల పరిధిలో విభజించిన ఏలూరు, పశ్చిమ, అల్లూరి సీతారామరాజు, డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, కాకినాడ జిల్లాల పరిధిలో ఎన్నికల ప్రక్రియ జరగనుంది. ఆరు జిల్లాల పరిధిలో మొత్తం 440 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఎన్నికల్లో మొత్తం 3,15,261 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనుండగా, ఇందులో పురుష ఓటర్లు 1,83,734 మంది, మహిళా ఓటర్లు 1,31,507, థర్డ్ జండర్ ఓటర్లు 20 మంది ఉన్నారు. నామినేషన్ల తేదీ వరకూ కొత్త ఓటర్లు నమోదు చేసుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

అమల్లోకి ఎన్నికల కోడ్

గ్రాడ్యూయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో బుధవారం నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినట్లు జిల్లా కలెక్టర్ సన్మోహన్ సగిలి ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలు నిలిచిపోనున్నాయి. సాధారణ ఎన్నికలకు వర్తించే అన్ని నిబంధనలూ అమల్లోకి రానున్నాయి. ప్రభుత్వం మంజూరు చేసిన కొత్త పనులు ఏవీ చేపట్టడానికి వీలుండదు. ప్రజాప్రతినిధులు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనడంపై ఆంక్షలు ఏర్పడనున్నాయి.

రిటర్నింగ్ అధికారిగా ఏలూరు జిల్లా కలెక్టర్

ఉభయ గోదావరి జిల్లాలో ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎంఎల్‌ఎసి ఎన్నికలకు సంబంధించి ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా కాకినాడ జిల్లా కలెక్టర్ వ్యవహరించేవారు. ఎంఎల్‌సి ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ, కౌంటింగ్ ఎన్నికల ప్రక్రియ అంతా కాకినాడ నుంచే జరిగేది. గ్రాడ్యుయేట్స్ ఎంఎల్‌ఎసి ఎన్నికలకు సంబంధించి రిటర్నింగ్ అధికారిగా ఏలూరు జిల్లా కలెక్టర్‌ను నియమించారు. దీంతో గ్రాడ్యుయేట్ ఎంఎల్సి ఎన్నికల ప్రక్రియ అంతా ఏలూరు కేంద్రంగా జరగనుంది. ఎన్నికలకు సంబంధించి మీడియా సెంటర్‌తో పాటు అన్నీ ఏలూరులోనే ఏర్పాటు కానున్నాయి.

టిడిపి, పిడిఎఫ్ మధ్య పోటీ

ఉభయ గోదావరి జిల్లా గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి టిడిపి, పిడిఎఫ్ అభ్యర్థి మధ్య పోటీ ఉండనున్నట్టు చెప్పొచ్చు. ఇప్పటికే టిడిపి పేరాబత్తుల రాజశేఖర్‌ను అభ్యర్థిగా ప్రకటించగా పిడిఎఫ్ అభ్యర్థిగా ఉపాధ్యాయునిగా పని చేసి రిటైరైన డివి.రాఘవులును అభ్యర్థిగా ప్రకటించారు.

ఫిబ్రవరి 27న గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నిక

తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టబద్రుల నియోజకవర్గ ఎన్నికకు సంబంధించిన షెడ్యూల్‌ను ఎన్నికల కమిషన్ బుధవారం విడుదల చేసింది. ఈ మేరకు కలెక్టర్ షాన్‌మోహన్ సగలి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల కమిషన్ విడుదల చెసిన షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ జారీ చేస్తారన్నారు. అదే నెల 10వ నామినేషన్‌ల స్వీకరణకు ఆఖరి తేదీ కాగా, ఫిబ్రవరి 11న నామినేషన్ల స్క్రూటినీ చేస్తారని తెలిపారు. నామినేషన్ల స్వీకరణకు ఫిబ్రవరి 13వ తేదీ ఆఖరు తేదీ కాగా ఫిబ్రవరి 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తామన్నారు. మార్చి 3న ఓట్ల లెక్కింపు చేసి విజేతను ప్రకటిస్తామని తెలిపారు. మార్చి 8వ తేదీతో ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందని ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు కోడ్ అమల్లో ఉంటుందని తెలిపారు.

జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాకు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం ప్రతినిధులు

పాలకు గిట్టుబాటు ధర కల్పించాలి

ప్రజాశక్తి - కాకినాడ

పాలకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, విశాఖ డైరీని అభివృద్ధి చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గుర్రాల అప్పారావు కోరారు. బుధవారం జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాను రైతు సంఘం నాయకులు తిరుమలశెట్టి నాగేశ్వరరావు, వాసంశెట్టి చందర్రావుతో కలిసి వినతిపత్రం అంద జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ డైరీలో పాలు పోస్తున్న పాల రైతులకు ఆవు పాలకు లీటర్‌కు రూ.2.50 నుంచి రూ.3 వరకూ తగ్గించడం దారుణమన్నారు. పాలకు రేషన్ విధానం ప్రవేశపెట్టడం అంటే రైతు ఎన్ని లీటర్ల పాలు పోస్తే అన్ని లీటర్లు తీసుకోకుండా తిరిగి వెనక్కి ఇచ్చే విధానం వల్ల రైతులకు తీవ్రమైన నష్టం జరుగుతుం దని రేషన్ విధానాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. వెంటనే రేషన్ విధానాన్ని రద్దు చేసి రైతులు ఎన్ని లీటర్ల పాలు పోస్తే అన్ని లీటర్ల పాలను తీసుకోవా లని కోరారు.

అవగాహనతోనే నేరాల నివారణ

ప్రజాశక్తి - కాకినాడ

ఎస్‌పి బిందుమాధవ్‌ను సత్కరిస్తున్న సుగుణారెడ్డి

అవగాహనతోనే ప్రమాదాలకు, నేరాలకు దూరం కాగలమని ఎస్‌పి జి.బిందుమాధవ్ అన్నారు. బుధవారం ఆదిత్య డిగ్రీ కళాశాలలో సైబర్ సెక్యూరిటీ, మాదకద్రవ్యాల వ్యతిరేకతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. మనం చేసే పొరపాటు వలన మన కుటుంబంతోపాటు, ఇతరులు కూడా ఇబ్బంది పడే పరిస్థితి వస్తుందని అన్నారు. కావున తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ వాహనాలను నడపాలని తెలిపారు. హెల్మెట్ ఆవశ్యకత, రేష్ డ్రైవింగ్ వల్ల జరుగుతున్న అనర్ధాలను వివరించారు. సైబర్ సెక్యూరిటీ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకుంటూ ప్రభుత్వ సూచనలను పాటించాలని అన్నారు. మోసగాళ్ల వలలో చిక్కుకోకూడదని, 'డ్రగ్స్ వద్దు బ్రో' అంటూ యువతకు పిలుపునిచ్చారు. సివిల్ సర్వీసెస్‌కి ప్రిపేర్ అయ్యే విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. అడిషనల్ ఎస్‌పి పాటిల్ దేవరాజ్ మనీష్ మాట్లాడుతూ విద్యార్థులు, యువత సోషల్ మీడియా యాప్‌లతో జాగ్రత్తగా ఉండాలని, సైబర్ మోసగాళ్ల ట్రాప్‌లో పడొద్దని సూచించారు. ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి మాట్లాడుతూ ట్రాఫిక్ నియమనిబంధనలను అనుసరించి వాహనాన్ని నడపాలని సూచించారు. డైరెక్టర్ డాక్టర్ నాయుడు కళాశాలలో డిఎఫ్ ఎపి, ఎన్ఎస్ఎస్ ద్వారా జరుగుతున్న కార్యక్రమాలను వివరించారు. అవగాహన సదస్సులో పాల్గొన్న ఎస్‌పికి ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నలమిల్లి శేషారెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు మజ్జి అప్పలనాయుడు, ఎన్.రమేష్, డి. రామారావు, విద్యాసంస్థల ట్రాన్స్‌పోర్ట్ ఇన్‌ఛార్జ్ సిహెచ్. వెంకటరెడ్డి, ఎన్ఎస్ఎస్ పిఒలు తేజేశ్వరరావు, ఐ.గౌరీప్రియ, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామానికి దగ్గరలోనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

తమ గ్రామానికి సమీపంలోనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని లబ్ధిదారులు స్పష్టం చేశారు. బుధవారం మండలంలోని తాటిపర్తి గ్రామానికి చెందిన లబ్ధిదారులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంపిడిఒ డి.శ్రీలలిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో తమ గ్రామానికి చెందిన వారికి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న రామేశంపేటలో ఇళ్ల స్థలాలు కేటాయించారని తెలిపారు. కూలి పనులు చేసుకునే తమకు గ్రామానికి సమీపంలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని నాడు అధికారులకు తెలియ చేసినట్లు తెలిపారు. తమకు తమ గ్రామ సమీపంలో ఇళ్ల స్థలాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఎంపిడిఒ మాట్లా డుతూ లబ్ధిదారుల అభిప్రాయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ ఇన్‌ఛార్జ్ కొమ్మిరెడ్డి బుజ్జి, నాయకులు రామిశెట్టి శ్రీను, పేపకాయల తిరుపతిరావు, నాం వీరభద్రరావు, ఎగ్గాడ సత్తిబాబు, ద్వారం పూడి చెల్లారావు, కొమ్మిరెడ్డి నాగ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - తాళ్లరేవు

రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎంపిపి

తాళ్లరేవు మెయిన్ రోడ్డు నుంచి ప్రజాసంఘాల భవనం వరకూ రూ.4 లక్షల వ్యయంతో సిసి రోడ్డు నిర్మాణానికి ఎంపిపి రాయుడు సునీత బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సంఘాల నాయకుల విజ్ఞప్తి మేరకు 15వ ఆర్థిక సంఘం నిధులతో సిసి రోడ్డును నిర్మిస్తున్నట్లు చెప్పారు. రోడ్డు నిర్మాణం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నున్న శంకర నారాయణ, నాయకులు రాయుడు గంగాధర్, మాజీ సర్పంచులు రెడ్డి రెడ్డిబాబు, వాసంశెట్టి శ్రీనివాస్, ప్రజా సంఘాల నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, వల్లు రాజబాబు, విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు అత్తిలి బాబూరావు, కడలి ప్రకాశరావు, ఎలిపే నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆసుపత్రి అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - రౌతులపూడి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ సత్యప్రభ

ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తానని ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ అన్నారు. బుధవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 30 పడకల ఆసుపత్రిగా ఉన్న రౌతులపూడి ఆసుపత్రిని 50 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తానని అన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఆసుపత్రిలో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రజలకు వైద్య సేవలందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తొలుత ఆసుపత్రిలో నెలకున్న పలు సమస్యలను ఆసుపత్రి స్థల దాత ఆర్.నారాయణమూర్తి సోదరుడు బుల్లబ్బాయి ఎంఎల్ఎకు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అరుజమ్మ, ఎంపిటిసి సభ్యులు సోమరౌతు రవి, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ పైల సాంబశివరావు, మాజీ ఎంపిపి ఇటంశెట్టి భాస్కరబాబు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు రెడ్డి చిన్నయ్యనాయుడు, బండారు సత్యనారాయణ, ఎ.లక్ష్మి, వైద్యాధికారి జానకిదేవి, తదితరులు పాల్గొన్నారు.

'ప్రత్యేక పాలసీతో టూరిజం అభివృద్ధి'

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధికి ప్రత్యేక పాలసీని తీసుకొచ్చి అమలు చేయనున్నామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. బుధవారం స్థానిక వెంకీ రెసిడెన్సీ హోటల్లో ఎపి హోటల్స్ అసోసియేషన్ సమావేశం జరిగింది. 26 జిల్లాల నుంచి పలు హోటల్స్ యజమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అర్ధరాత్రి 12 గంటల వరకు హోటల్స్ తెరిచేలా త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. టూరిజం శాఖకు ఇండస్ట్రీ హోదా ఇస్తున్నామన్నారు. పరిశ్రమలకి ఇచ్చే రాయితీలు అన్ని ఇస్తామని హామీ ఇచ్చారు. హోటల్ ఇండస్ట్రీస్ పట్ల ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉందన్నారు. టూరిజం అభివృద్ధి చెందాలంటే హోటల్ ఇండస్ట్రీని ముందుకు తీసుకుని వెళ్లాలన్నారు. హోటల్ ఇండస్ట్రీస్ సమస్యలను ప్రభుత్వం పరిష్కారం చేస్తుందన్నారు. రూ. 1217 కోట్లు హోటల్ రంగంపై పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చామన్నారు. హోటల్ ఇండస్ట్రీని ముందుకు తీసుకు వెళ్లడానికి ఎటువంటి ఇబ్బందులు పడకుండా వాటిని ఎలా పరిష్కరించాలనే ఆలోచన ప్రభుత్వం చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక ఆలోచనతో టూరిజం అభివృద్ధికి సానుకూల వృక్పథంతో ఉన్నారన్నారు. ఎపిలో సింగిల్ విండో విధానంలో టూరిజం అభివృద్ధికి సహకరిస్తామన్నారు. టూరిజం అభివీద్ధికి రాష్ట్రంలో అపారమైన అవకాశాలు ఉన్నాయని అన్నారు. టెంపుల్ టూరిజం అభివృద్ధి చేస్తామన్నారు. పర్యాటకుల సందర్శనలో వారికి సౌకర్యాలు కల్పించడంలో హోటళ్ల పాత్ర చాలా కీలకంగా ఉందన్నారు. పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ మాట్లాడుతూ టూరిజాన్ని ఒక పరిశ్రమగా తీసుకుని వస్తున్నామని, హోటళ్లకు విద్యుత్ రాయితీలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కొత్తగా ఏర్పాటు అయ్యే హోటళ్లకు రాయితీలు ఇచ్చే విధంగా టూరిజం అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. జిల్లాలో మంచి, పర్యాటక ప్రదేశాలు ఉన్నాయని, వాటిని సక్రమంగా వినియోగించుకుంటే ప్రభుత్వానికి ఆదాయం కూడా వస్తుందన్నారు. పర్యాటక ప్రదేశాల్లో సౌకర్యాల మెరుగుదలకు కృషి చేస్తామన్నారు. ఎపి హోటల్స్ అసోషియేషన్ అధ్యక్షుడు ఆర్‌వి.స్వామి మాట్లాడుతూ టూరిజం శాఖ ద్వారా హోటళ్ల నిర్వహణకు అవసరమైన తోర్పాటును అందజేయాలని కోరారు. లైసెన్స్ ఫీజులను రద్దు చేయాలని కోరారు. కుడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి మాట్లాడుతూ టూరిజంపై సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టితో ఉన్నారన్నారు. ఎపి టూరిజం డవలప్‌మెంట్ కార్పొరేషన్(టిడిసి) ఛైర్మన్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ రాష్ట్రంలో టూరిజం అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వెంకీ రేసిడెన్సీ ఎండి మూర్తి, హోటళ్ల యజమానుల అసోసియేషన్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇవిఎం, వివి ప్యాట్స్‌కు పటిష్ట భద్రత

ప్రజాశక్తి - కాకినాడ

అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఇవిఎం, వివిప్యాట్స్ గోదామును కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి బుధవారం పరిశీలించారు. ఇవిఎం గోదాము భద్రతకు చేపడుతున్న చర్యలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇవిఎం, వివిపాట్స్ భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలని రెవెన్యూ, ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెల ఇవిఎం గోదామును పరిశీలించి నివేదిక పంపిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ పరిశీలనలో తహశీల్దార్ వి.జితేంద్ర, కలెక్టరేట్ ఎన్నికల విభాగం డిటి ఎం.జగన్నాథం, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజల సేవలో పోలీస్

ప్రజాశక్తి - గొల్లప్రోలు

ప్రజలు పోలీసుల సేవలను వినియోగించుకోవాలని ఎస్ఐ ఎన్.రామకృష్ణ కోరారు. బుధవారం పట్టణంలోని రాయవరం రోడ్డు మార్కెట్ సెంటర్‌లో 'ప్రజల సేవలో పోలీస్' అనే బ్యానర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ, మండల వ్యాప్తంగా ప్రజల సేవలో పోలీస్ అనే బ్యానర్లను ఏర్పాటు చేస్తున్నామని, ఆ బ్యానర్‌పై ఎస్ఐ ఫోన్ నెంబర్ 9440900758, సిఐ 9440796523, పోలీస్ స్టేషన్ 9154880095, డయల్ 100,112 ఫోన్ నెంబర్లు ఉన్న బ్యానర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రఘురామ్ వ్యాఖ్యలు సరికావు

ప్రజాశక్తి - జగ్గంపేట

మీడియాతో మాట్లాడుతున్న అప్పలరాజు

వైసిపి నాయకుడు రఘురామ్ స్థాయి మరచి వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎస్‌విఎస్.అప్పలరాజు హితవు పలికారు. బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిఎం చంద్రబాబును విమర్శంచే స్థాయి రఘురామ్‌కు లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 6 నెలల కాలంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని అన్నారు. ఇచ్చిన హామీ మేరకు పింఛన్‌ను ఏకకాలంలో రూ.4 వేలకు పెంపుదల చేశారని అన్నారు. అదే వైసిపి పాలనలో ఏడాదికి రూ.250 చొప్పున పెంచి అవ్వ, తాతలను మోసం చేశారని అన్నారు. సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మారిశెట్టి భద్రం, ఆర్య వైశ్య వెల్ఫేర్ అండ్ డెవలంప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, జీను మణిబాబు, దేవరపల్లి మూర్తి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి - సామర్లకోట


బాధితులను పరామర్శిస్తున్న ఎంపిపి సత్తిబాబు

మండలంలోని వేట్ల పాలెంలో ఇంటి నిర్మాణ వివాదంలో హత్యకు గురియైన వారి కుటుంబాలను బుధవారం ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, వైసిపి మండల అధ్యక్షుడు తలారి దొరబాబు పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు తమ బాధలను నాయకులకు వివరించారు. తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ వైస్ ఛైర్మన్ మోరంపూడి రమేష్, వేట్లపాలెం రైతు సంఘం ప్రెసిడెంట్ రాయుడు శ్రీనివాస్, రైతు సంఘం నాయకులు వేగుళ్ల బాబ్జి, రాజబాబు, రవికిషోర్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజలను మోసం చేస్తున్న చంద్రబాబు'

ప్రజాశక్తి - ప్రత్తిపాడు


గిరిబాబును కలిసిన వైసిపి నాయకులు

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను సిఎం చంద్రబాబు మోసం చేస్తున్నారని వైసిపి నియోజకవర్గ కో-ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. బుధవారం ఏలేశ్వరం, రౌతులపూడి మండలాలకు చెందిన పలువురు వైసిపి నాయకులు కిర్లంపూడిలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత జగన్‌దేనని అన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఏదో అభివృద్ధి చేస్తున్నట్లు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయలేనని చెప్పడం దారుణమన్నారు. హామీలను అమలు చేయలేనప్పుడు ఎందుకు హామీలు ఇచ్చారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో రమణయ్యపేట గ్రామ సర్పంచ్ ములగపాటి రమేష్‌రాజు, ఉప సర్పంచ్ సూపర్తి లక్ష్మణ్ దొర, కాకి నాని పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - పెద్దాపురం


ఎఇకి వినతిపత్రం ఇస్తున్న వినియోగదారులు

స్థానిక వరహాలయ్య పేట శివారు చల్లా వారి గురువు వీధిలో హైవోల్టేజీ వల్ల విద్యుత్తు వినియోగదారులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, కావున ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని వినియోగదారులు కోరారు. బుధవారం విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ సుబ్బారావును పలువురు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకేసారి హై వోల్టేజీ రావటం వల్ల ఇంటిలో ఉపయోగించే విద్యుత్తు ఉపకరణాలు కాలిపోతున్నాయన్నారు. గతంలో ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎఇ స్పందిస్తూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యప్రకాష్, సత్యనారాయణ, పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



వరి సాగులో సస్య రక్షణ కీలకం

ప్రజాశక్తి - కాజులూరు

శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త శర్మ

వరి సాగులో సస్యరక్షణ కీలకమని పెద్దాపురం ఏరువాక శాస్త్రవేత్త ఎఎస్ఆర్.శర్మ అన్నారు. బుధవారం మండలంలోని కోలంక గ్రామంలో మండల వ్యవసాయ అధికారి అశోక్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ వరి సాగులో సస్యరక్షణ కీలకమని, ప్రతి తెగులుకి అధికారులను సంప్రదించి మందులు వినియోగించుకున్నట్లయితే రైతులు ఆర్థికంగా ఇబ్బందులు కలగవన్నారు. ఏ తెగులుకి ఏ మందులు వాడుతున్నారో తెలుసుకుని వారి అనుమానాలను నివృత్తి చేశారు. ప్రస్తుతం తెగులుకు వినియోగిస్తున్న మందులను వివరించి పరిశోధనలో ఉన్న మందులను వివరించారు. పిచికారిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. ఎన్‌పిపిఎస్ యాప్ ద్వారా పంటకు హాని కలిగించే పురుగు, తెగులను గుర్తించి ఏ మందులు వాడాలో రైతులకు అవగాహన కల్పించారు. సహకార సంఘం మాజీ అధ్యక్షులు డివి నరసింహరాజు, భూపతిరాజు రామచంద్రరాజు మాట్లాడుతూ రైతులకు రాయితీపై యంత్ర పరికరాలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌సి ఎడిఎ మాధవి, కోటిపల్లి సాగునీటి పంపిణీ సంఘం అధ్యక్షులు దాట్ల విజయ గోపాలరాజు, మండల విస్తరణ అధికారి శ్రీనివాస వర్మ, సచివాలయ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హెటిరో ప్రతినిధి సూర్యప్రకాష్

ఆదిత్య విద్యార్థుల పరిశ్రమల సందర్శన

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెంలో ఉన్న ఆదిత్య ఫార్మసీ కాలేజీ విద్యార్థులు హెటిరో ల్యాబ్స్, నక్కపల్లి పరిశ్రమ సందర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ డి.సతీష్‌కుమార్ మాట్లాడుతూ 80 మంది విద్యార్థులు ఈ సందర్శనలో పాల్గొన్నారని, దీనివల్ల పరిశ్రమ వాతావరణానికి పరిచయం కలిగి, పరిశ్రమలో జరిగే వివిధ ప్రక్రియలపై అవగాహన పొందినట్లు తెలిపారు. ఈ ప్రాక్టికల్ అనుభవం ఫార్మాస్యూటికల్ తయారీ పట్ల వారి అవగాహనను కల్పించినట్లు వివరించారు. హెటిరో ల్యాబ్స్ అధికారులు సక్రియ ఔషధ పదార్థాలు ఉత్పత్తి, నాణ్యత నియంత్రణ చర్యలు, మరియు గుడ్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాక్టీస్ అనుసరణ యొక్క ప్రాముఖ్యత గురించి విలువైన సూచనలు అందించారు. ఈ పర్యటనలో ముంటా దుర్గశ్రీనివాస్, హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్ యూనిట్ ప్రతినిధి టివి.సూర్యప్రకాశ్, ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు..

నేరాలు ఘోరాలు

విలేకరులతో మాట్లాడుతున్న డిఎస్‌పి శ్రీహరిరాజు

బాలిక భర్త, అత్తల అరెస్టు

ప్రజాశక్తి - పెద్దాపురం

మైనర్ బాలికను ప్రేమ పేరుతో మోసం చేసి పెళ్లి చేసుకుని నిర్బంధించి, వ్యభిచారం చేయమని ఒత్తిడి చేసిన భర్తను, అత్తను అరెస్టు చేసినట్లు డిఎస్‌పి శ్రీహరిరాజు తెలిపారు. బుధవారం డిఎస్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనకాపల్లి జిల్లా ఎస్‌రాయవరం మండలం బంగారమ్మ పాలెం గ్రామానికి చెందిన మైనర్ బాలికను పెద్దాపురం ఎన్‌టిఆర్ కాలనీకి చెందిన ధరణికోట చందు ప్రేమ పేరుతో మోసం చేసి ఆమెను తీసుకుని వెళ్ళిపోయాడన్నారు. దీనిపై ఆరు నెలల క్రితం రాయవరం పోలీస్ స్టేషన్‌లో బాలిక తల్లిదండ్రుల చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు అయిందన్నారు. పోలీసులు వారిరువురిని తీసుకువచ్చి వారికి, తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారన్నారు. ఇరువురి పెద్దలు ఈ సమస్య పరిష్కరించుకుంటామని వెళ్లిపోయారన్నారు. తర్వాత వారిష్ట ప్రకారం పెళ్లి చేసుకుని రాయవరంలో ఉన్నారన్నారు. తర్వాత డిసెంబర్లో పెద్దాపురం వచ్చి ఎన్‌టిఆర్ కాలనీలో నివాసం ఉంటున్నారన్నారు. భార్యాభర్తల మధ్య వచ్చిన మనస్పర్థలు కారణంగా ఆమె ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించిందన్నారు. డిసెంబర్ 28వ తేదీన కాకినాడ ప్రభుత్వాసుపత్రి నుంచి పెద్దాపురం పోలీస్ స్టేషన్‌కు ఇండికేషన్ రాగా పెద్దాపురం పోలీసులు ఆసుపత్రికి వెళ్లి ఆమెను విచారించి మేజిస్ట్రేట్‌చే డిడి చేయించారన్నారు. వైద్య సహాయం అనంతరం ఆమె తల్లిదండ్రులు ఆమెను విశాఖపట్నం నిమ్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స నిమిత్తం చేర్పించారన్నారు. ఆమె మాట్లాడటం లేని స్థితిలో ఉన్నందున ఆమె తల్లి దుర్గమ్మ ఇచ్చిన స్టేట్‌మెంట్ ప్రకారం ముద్దాయిలపై కిడ్నాప్, అక్రమ నిర్బంధం, మానభంగం సెక్షన్లు, ఫోక్సో చట్టంలోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి డిఎస్‌పి ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ జరుపుతుందన్నారు. ఈ సమావేశంలో సిఐ కృష్ణభగవాన్, ఎస్ఐ వి.మౌనిక పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - కోటనందూరు

మండలంలోని భీమవరపుకోటలో బీద సింహాచలం తాటాకు ఇల్లు దగ్ధం అయింది. బాధితురాలు రోజువారీ కూలీగా హంసవరం ఫ్యాక్టరీలో బుధవారం పనికి వెల్లింది. అయితే ప్రమాదవశాత్తు ఇంటిలో మంటలు వ్యాపించడంతో స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. హుటాహుటీన సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అప్పటికే ఈ ప్రమాదంలో విలువైన వస్తువులతోపాటు, కొంత బంగారం, రూ.63 వేలు నగదు, ఇతర వస్తువులు కాలిపోయాయని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది.

సలీం మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక భీమేశ్వరాలయం కొత్త వంతెన పైనుంచి గోదావరి కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన పెదపూడి మండలానికి చెందిన పాత్రికేయుడు షేక్ సలీం మృతదేహం 20 రోజుల తరువాత లభించింది. సామర్లకోట - కాకినాడ రోడ్డులోని గోదావరి కాలువలో లాకులు దాటిన తరువాత గుర్రపు డెక్క మధ్యలో మృతదేహం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మృతదేహన్ని బయటకు తీసి సలీం భార్య, కుటుంబీకులకు సమాచారం అందించారు. వారు మృతదేహం సలీందేనని నిర్ధారించారు. ఈనెల 9వ తేదీ రాత్రి 7 గంటల ప్రాంతంలో స్థానిక రైల్వే గేట్ సమీపంలో వంతెన పైనుంచి గోదావరి కాలువల దూకి ఆత్మహత్యకు పాల్పడగా, అతని కోసం పోలీసులు గాలింపు చర్యలు కొనసాగించారు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా సలీం ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలుస్తోంది. మృతదేహానికి అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ ఎ.కృష్ణభగవాన్ తెలిపారు.

బైకులు ఢీకొని ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - సీతానగరం

కూనవరం-మిర్తిపాడు రోడ్డులో రెండు బైకులు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. కూనవరానికి చెందిన పీతల వీరపండు, కొల్లి బొడ్డియ్య కోరుకొండ వైపు వెళుతుండగా కోటి గ్రామానికి చెందిన అడపా శ్రీనివాస్ బైకులు ఎదురుగా ఢీకొన్నాయి. మంచులో దారి కనిపించక ఈ ప్రమాదం చోటు చేసకుంది. ఈ ప్రమాదంలో గాయపడిన శ్రీనివాస్‌ను ప్రవేట్ ఆసుపత్రికి, బొడ్డియ్యను ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

'వేల గొంతులు -లక్ష డప్పుల' విజయవంతానికి పిలుపు

ప్రజాశక్తి - తాళ్లపూడి

హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న నిర్వహించనున్న వేల గొంతులు లక్ష డప్పుల కార్యక్రమానికి అధిక సంఖ్యలో మాదిగలు హాజరై విజయవంతం చేయాలని ఎమ్ఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు పిలుపునిచ్చారు. లక్ష డప్పుల విజయవంతం చేయడానికి ఎమ్ఆర్‌పిఎస్ శ్రేణులను సిద్ధం చేసే కార్యక్రమంలో భాగంగా నాగరాజు బుధవారం తాళ్లపూడి మండలం పైడిమెట్ట గ్రామానికి వచ్చారు. ఈ క్రమంలో ఎమ్ఆర్‌పిఎస్ శ్రేణులతో నిర్వహించిన సమావేశంలో నాగరాజు మాట్లాడుతూ 30 సంవత్సరాల దండోరా ఉద్యమంలో పైడిమెట్లకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. గ్రామంలో నుండి అధిక సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొనడంతో పాటు ఇతరులను కూడా చైతన్య పరచాలని సూచించారు. మాజీ ఎంపిపి కొప్పాక కోట్నీస్ , గెడ్డం గణేష్, డాక్టర్ జొన్నకోటి ప్రమోద్ కుమార్, కొల్లి చిన్న బాబు, జొన్నకూటి పాపారావు, ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గెడ్డం వినోద్ మాదిగ, ముప్పిడి డానియేలు మాదిగ, తాళ్లపూడి మండల శాఖ అధ్యక్షులు బాబి నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వంతెనలు..!

-భయంతో ప్రయాణికులు -పట్టించుకోని పాలకులు

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలో పలు వంతెనలు శిథిలావస్థలో ఉన్నాయి. ఆ వంతెనలపై ప్రయాణించాలంటే ప్రయాణికులు ప్రాణాలను గుంపెటలో పెట్టుకోవాల్సిన దుస్థితి నెలకుంది. కూలిపోయే దశలో ఉన్న వంతెనలు కళ్లదుటే కన్పిస్తున్నా అధికార యంత్రాంగం, పాలకులకు కన్పించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

మండలంలో 26 పంచాయతీల పరిధిలో 44 గ్రామాలు ఉన్నాయి. రౌతులపూడి, శంఖవరం ఆర్ అండ్ బి రహదారి మలుపులతో..ప్రకృతితో అందాలతో ఈ రహదారి ఉంటుంది. ప్రకృతి అందాలను తిలకించేందుకు ఇటీవల పర్యాటకుల రాకపోకలు సాగిస్తున్నారు. అయితే ఈ రహదారిలో పలు వంతెనలు ప్రయాణికులతోపాటు, పర్యాటకులను తీవ్ర భయాందోళనకు గురి చేస్తున్నాయి. పలు వంతెనలకు ఏళ్ల తరబడి కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. వంతెనల వద్ద ఏమాత్రం అలసత్వం వహించినా ప్రాణాలను ఫణంగా పెట్టాల్సిన పరిస్థితులు నెలకున్నాయి.

రౌతులపూడి-శంఖవరం ఆర్ అండ్ బి రహదారిలో ప్రమాదకరంగా మారిన వంతెన

మండలంలోని బంగారయ్యపేట గ్రామ శివారు అంగడాల వంతెన వద్ద పశువులను రవాణా చేస్తున్న ఒక వ్యాన్ బోల్తా కొట్టడంతో కొన్ని పశువులు మృతి చెందాయి. అదే వంతెన మీద ప్రయాణిస్తున్న కారు గెడ్డలోకి బోల్తా పడటంతో పలువురు తీవ్ర గాయాల పాలయ్యారు. రౌతులపూడి గ్రామ శివారు రాళ్ల గట్టు వంతెన వద్ద క్వారీ లారీలు, గ్రావెల్ తరలించే ట్రాక్టర్లు అదుపుతప్పి ప్రమాదాలకు గురయ్యాయి. బంగారయ్య పేట గ్రామ శివారులో ఉన్న అంగడాల గెడ్డ వద్ద నిర్మించిన వంతెన బ్రిటిష్ కాలం నాటిది. ప్రస్తుతం ఆ వంతెన శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. అలాగే తూర్పు మద్దుము గెడ్డ వద్ద ఉన్న వంతెన, బంగారు పేట గ్రామ శివారు ఎర్ర చెరువు వద్ద ఉన్న వంతెన కూడా శిథిలావస్థకు చేరుకున్నాయి. ఏళ్ల తరబడి శిథిలావస్థలో ఉన్నా సంబంధిత శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిధులు మంజూరు అయినా...

2017-18 సంవత్సరంలో నాటి ప్రభుత్వం శంఖవరం మండలంలోని నెల్లిపూడి వంతెనతోపాటు, రౌతులపూడి మండలంలో ఉన్న మూడు వంతెనలను పున్ణనిర్మాణ పనుల కోసం రూ.2 కోట్లను మంజూరు చేసింది. అయితే అప్పటి ప్రజా ప్రతినిధులకు, కాంట్రాక్టర్‌కు మధ్య వివాదం ఏర్పడటంతో నెల్లిపూడి వంతెనను నిర్మించి పక్కకు తప్పుకున్నారు. దీంతో మండలంలో నిర్మించాల్సిన మూడు వంతెనల పనులు సైతం పక్కకుపోయాయి. దీంతో ఆ నిధులు వెనక్కి వెళ్ళిపోయాయి. తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం రోడ్ల పట్ల కనీసం కన్నెత్తి చూడకపోవడంతో ఈ వంతెనలు దారుణంగా మారాయి.

సామర్థ్యానికి మించి రవాణా

ఏళ్ల తరబడి ఎటువంటి మరమ్మతులకు నోచుకోని వంతెనలపై నేడు సామర్థ్యానికి మించిన వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. మండలంలోని నల్లరాయి క్వారీల నుంచి తరలించేందుకు వస్తున్న లారీలు 30 నుంచి 50 టన్నుల బరువుతో రవాణా సాగిస్తున్నాయి. దీంతో ఈ వంతెనలు మరింతగా దెబ్బతింటున్నాయి. ఎప్పుడు ఎటువంటి ప్రమాదాలు జరుగుతాయోనన్న ఆందోళనలో ప్రజలు ఉన్నారు.

రూ 3.50 కోట్లతో ప్రతిపాదనలు

రౌతులపూడి నుంచి శంఖవరం వెళ్లే ఆర్ అండ్ బి రహదారిలోఉన్న మూడు వంతెన నిర్మాణ పనులకు రూ.3.50 కోట్ల రూపాయల అంచనాలతో ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు నివేదించాం. నిధులు మంజూరు చేసిన వెంటనే నిర్మాణ పనులు చేపడతాం.

-జి.రజిని, ఎఇ, ఆర్ అండ్ బి

మహిళా చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - గండేపల్లి

మహిళా చట్టాలపై ప్రతీ ఒక్కరూ అవగాహన చేసుకోవాలని పెద్దాపురం 7 వ అడిషనల్ జిల్లా న్యాయమూర్తి జి. చాముండేశ్వరి అన్నారు. బుధవారం స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో జాతీయ మహిళా కమిషన్, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలనీ, ఆర్థిక స్థోమత లేకపోవడం న్యాయం పొందడానికి ఆటంకం కాకూడదనే లక్ష్యంతో ఉచిత న్యాయ సేవా సంస్థలు ఏర్పాటు చేశారని అన్నారు. వారసత్వ ఆస్థులు కొనుగోలు చేసినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలనీ, ఆస్థి మార్పిడి పత్రాలు క్రమ పద్ధతిలో ఆన్‌లైన్ చేసుకుంటే కోర్టుల్లో సివిల్ తగాదాలు సులభంగా పరిష్కారం అవుతాయని అన్నారు. న్యాయవాదులు ఎ.ప్రభూజీ, ఎం.రాంబాబు, ఎస్.దుర్గారావు, ఎస్.విశాలాక్షి బాల్య వివాహాల నిషేధ చట్టం, వరకట్న నిరోధక చట్టం, లోక్ అదాలత్ ల ద్వారా సత్వర పరిష్కారం, లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఒ నాతి బుజ్జి, సిడిపిఒ పూర్ణిమ, సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్, డిఆర్‌డిఎ ఎంపిఎం సన్యాసిరావు, సమాఖ్య నాయకులు పాల్గొన్నారు.

వర్థంతి సభలో మాట్లాడుతున్న రాజా సూరిబాబు రాజు

అంజలీదేవి నటన మరువలేనిది

ప్రజాశక్తి - పెద్దాపురం

తెలుగు చలనచిత్ర సీమలో పట్టణానికి చెందిన అంజలీదేవి నటన ఎప్పటికీ మరువలేనిదని మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు అన్నారు. బుధవారం స్థానిక పాత బస్టాండ్ సెంటర్లోని అంజలీదేవి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంజలీదేవి పేరుతో పట్టణంలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షులు పోలమరశెట్టి సత్తిబాబు, టిడిపి పట్టణ అధ్యక్షులు రంది సత్యనారాయణ, నాయకులు కందుల వెంకటచలం, అన్నాబత్తుల అంజిబాబు, గోళ్ళ బాబి, లక్ష్మి, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గడ్డం పెద్దకాపు పాల్గొన్నారు.

'చంద్రబాబుతో సంక్షేమం సాధ్యం'

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

విలేకరులతో మాట్లాడుతున్న సత్యనారాయణమూర్తి

జగన్ పరిపాలనే నేడు ప్రజలకు శాపంగా మారిందని టిడిపి నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి విమర్శించారు. బుధవారం వలసపాకలులోని తన నివాసంలో ఏర్పాటు చసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గడిచిన 7 నెలల కూటమి పాలనలో ఆరోగ్యశ్రీ, ధాన్యం, ఫీజ్ రీయింబర్స్‌మెంట్, ఉద్యోగులు, కాంట్రాక్టర్లుకు గత వైసిపి ప్రభుత్వం పెట్టిన బకాయిలను తీర్చడానికే రూ.1.40 కోట్లు చెల్లించడం జరిగిందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం ఇంతగా బకాయిలు పెట్టింది లేదన్నారు. వారి చేసిన తప్పులను సరిదిద్దడానికే సమయం పడుతుందని, అయినా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత చంద్రబాబుదేనని అన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు కొమిరి శెట్టి నరసింగరావు, రామ సత్యనారాయణ పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - జగ్గంపేట, పెద్దాపురం

ఉచిత పశు ఆరోగ్య వైద్య శిబిరాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్‌కుమార్ పిలుపు నిచ్చారు. బుధవారం మండలంలోని మన్యం వారిపాలెంలో పశువైద్యాధికారి వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరాన్ని నవీన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో పశువులు ఉన్న ప్రతి ఒక్క రైతు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు పశువుల పోషణకు అనువుగా ప్రభుత్వం గోశాల నిర్మాణం చేపట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు వైశాధికారి సూర్యప్రకాశ్, నాయకులు మారిశెట్టి భద్రం, దేవరపల్లి మూర్తి, అడబాల ఆంజనేయులు, జీను మణిబాబు, రైతులు పాల్గొన్నారు. అలాగే **పెద్దాపురం** మండలంలోని పులిమేరులో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో పశువులకు పరీక్ష లు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ వేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారులు డాక్టర్ ఎ.మస్తాన్ బి, ఎహెచ్ఎ పుష్ప రాజు, పి.ప్రసాద్, బి.ప్రసాద్, గోపాలమిత్ర రాజు పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్

సర్వే బృందంతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా

రీ సర్వేను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - రౌతులపూడి

రీ సర్వేను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని వెంకటాపురంలో జరుగుతున్న రీ సర్వేను ఆయన పరిశీలించారు. ప్రభుత్వ భూములు, అటవీ భూములు, బంజరు భూముల వివరాలను ఆయన తెలుసుకున్నారు. రీ సర్వే అవశ్యకతను సిబ్బందికి వివరించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సర్వే నిర్వహించాలని, రైతుల భూములు సర్వే చేసే సమయంలో కచ్చితంగా సంబంధిత రైతులకు సమాచారం అందించాలని అన్నారు. సర్వే పూర్తయిన తర్వాత రైతుకు తనకు సంబంధించిన భూమి విస్తీర్ణాన్ని తెలియజేయాలని తెలిపారు. అనంతరం రాజవరంలో నిర్మాణంలో ఉన్న సచివాలయ, రైతు సేవా కేంద్రాల భవన పనులను పరిశీలించారు. త్వరగా భవన నిర్మాణాలను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో డివిజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ ప్రసాద్, రీ సర్వే డిటి రవితేజ, మండల సర్వేయర్ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

తాండవ రిజర్వాయర్ కాలువను పరిశీలిస్తున్న ఇఇ బాలసూర్యం

రూ.13 కోట్లతో ప్రతిపాదనలు

ప్రజాశక్తి - కోటనందూరు

తాండవ రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువల అభివృద్ధికి రూ.13 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించినట్లు తాండవ రిజర్వాయర్ ఇఇ బాలసూర్యం తెలిపారు. బుధవారం మండలంలోని అల్లిపూడి, కోటనందూరు, కాకరాపల్లి, భీమవరపుకోట, గ్రామాల పరిధిలో ఉన్న తాండవ రిజర్వాయర్ కాలువలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా 103 పనులను గుర్తించడం జరిగిందని అన్నారు. రూపొందించిన ప్రతిపాదనలను జిల్లా ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిపారు. ఈ పర్యటనలో తాండవ రిజర్వాయర్ వైస్ ఛైర్మన్ మేడపరెడ్డి జోగుబాబు, నాయకులు వృత్తల నానాజీ, అంకమరెడ్డి బుల్లిబాబు, రాజారావు, తాండవ డిఇ అనురాధ, జెఇ శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

గరగ నత్యాలతో సందడి చేస్తున్న మహిళలు

కోలాహలంగా చొల్లంగి తీర్థం

ప్రజాశక్తి - తాళ్లరేవు

చొల్లంగి తీర్థం బుధవారం కోలాహలంగా జరిగింది. పలు గ్రామాల నుంచి యువకులు అప్పన్నెద్దులను చొల్లంగి తీర్థానికి ఊరేగింపుగా తరలివచ్చారు. మహిళలు గరగనృత్యాలతో గ్రామ దేవతలను తలపై ఎత్తుకుని చొల్లంగి సంగమేశ్వర, సోమేశ్వర, వెంకటేశ్వర స్వామిల ఆలయాలను దర్శించుకున్నారు. పెనుగుదురుకు చెందిన బండారు వెంకటేశ్వరరావు భక్తులకు పులిహోరను పంపిణీ చేశారు. అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. ఈ కార్యక్రమంలో బూరెల వెంకటరాజు, కనకాల సిద్ధిశేషారావు, బూరెల చక్రధర్, కట్ట త్రిమూర్తులు, గర్రె లక్ష్మీనారాయణ, ఏనుగుల రాజు, తణుకు నారాయణ పాల్గొన్నారు.

లిఫ్ట్ ఇరిగేషన్ సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి - కరప

మండలంలోని గొర్రిపూడి లిఫ్ట్ ఇరిగేషన్ సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. గొర్రిపూడి, వేమవరం, చోల్లంగి, గురజానపల్లి గ్రామాలకు చెందిన 4800 ఎకరాల ఆయకట్టుకు లిఫ్ట్ ఇరిగేషన్ పనిచేయకపోవడంతో పొలాలకు నీరు చేరడం లేదు. దీనిపై ఎంఎల్ఎ పంతం నానాజీ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కలెక్టర్ స్పందించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయించారు. దీనిపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఎంఎల్ఎ పంతం నానాజీకి, కలెక్టర్ షాన్‌మోహన్‌కు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ఫిజియోథెరపీపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిజం హాస్పిటల్ ద్వారా ఫిజియోథెరపీపై అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ కె.స్వప్న బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవగాహన సదస్సును సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

పూజలు చేస్తున్న ఎంఎల్ఎ తనయుడు సందీప్

సంగమేశ్వర స్వామిని దర్శించుకున్న సందీప్

ప్రజాశక్తి - కరప

మండలంలోని ఉప్పలంక గ్రామ శివారు మొండిలో జరిగిన చొల్లంగి తీర్థంలో ఎంఎల్ఎ పంతం నానాజీ తనయుడు పంతం సందీప్ సంగమేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు నున్న గణేష్‌నాయుడు, బండారు మురళి, తదితర నాయకులు పాల్గొన్నారు.

లారీ చక్రాల కింద పడి మృతి చెందిన కొండచిలువ

కొండచిలువ హల్‌చల్

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని మల్లేపల్లి గ్రామ శివారు జాతీయ రహదారిని దాటే క్రమంలో బుధవారం రాత్రి 7:30 గంటల ప్రాంతంలో కొండచిలువ హల్‌చల్ చేసిది. సుమారు 15 నిమిషాల పాటు రోడ్డు దాటడానికి ప్రయత్నించింది. దీంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. రోడ్డు దాటే క్రమంలో ఒకపక్క నుంచి మరోపక్కకు వెళ్తే క్రమంలో ఒక్కసారిగా వచ్చిన లారీ చక్రాల కింద పడి నుజ్జునుజ్జు అయింది.

గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్న నిర్వాహకులు

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

మన పెద్దాపురం ఫేస్‌బుక్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫేస్‌బుక్ అడ్మిన్ పెద్దిరెడ్డి నరేష్ మాట్లాడుతూ పట్టణానికి చెందిన ఆవపాటి వెంకటరమణ, ఆవపాటి విష్ణుల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఆవపాటి సాయిలక్ష్మి సాయంతో ఈ ఆహారాన్ని అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆవపాటి సాయిలక్ష్మి, సభ్యులు సత్యప్రశాంత్, రాజేష్‌కుమార్, ఆనంద్, శేఖర్, సత్యనారాయణ, జయశ్రీ, రత్నం పాల్గొన్నారు.

ఘనంగా పురంధరదాసు ఆరాధన ఉత్సవాలు

ప్రజాశక్తి - సామర్లకోట

ఆరాధన కీర్తనలు ఆలపిస్తున్న ప్రతినిధులు

కర్ణాటక సంగీత పితామహుడు, పురందరదాసు ఆరాధన ఉత్సవాలు బుధవారం స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. తొలుత పురందరదాసు చిత్రపటం వద్ద పూలమాల ఉంచి పూజలు చేశారు. వివిధ భజన మండలి బృందాల సభ్యులు పురందరదాసు కీర్తనలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో భజన మండలి ప్రతినిధులు కాపుగంటి పైడిరత్నం, కటకం హైమావతి, కుమారి, భవాని, కుమారి సరస్వతి, మోహన్ లక్ష్మి పాల్గొన్నారు.

ఎస్‌పిని కలిసిన కాపవరపు కుమార్

ప్రజాశక్తి - సామర్లకోట

ఎస్‌పిని సత్కరిస్తున్న కుమార్

ఎస్‌పిగా బాధ్యతలు స్వీకరించిన జి.బిందుమాధవ్‌ను ఎఐఎండిఎస్ జాతీయ అధ్యక్షులు కాపవరపు కుమార్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఉండవల్లి వీర్రాజుచౌదరి, మాజీ ఎంఎల్ఎ తనయుడు ఎండీ రబ్బానీ, తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

E.A. No. 198/2018
E.P. No. 69/2016 in
O.S. No. 106/2016

Between:
1. Mallidi Veera Raghava Reddy
2. Mallidi Satish Kumar Reddy
3. Mallidi Srinivasa Reddy
...*Claim Petitioners*
AND
Akella Srinivasa Rao and Others
...*Respondents/ JDrs*

3. Mallidi Naga Sivani, D/o. late Venkata Rama Reddy, Hindu, aged 14 years, Kuthukuluru Village, Anaparthi Mandal, East Godavari RJCJ, being minor represented by her mother and natural guardian Mallidi Leelavathi, W/o. late Venkata Rama Reddy.
...*3rd Respondent/ JDr*

పై నెంబరు క్లయిమ్ పిటీషన్‌లో 3వ రెస్పాండెంటు/ JDr అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 03-02-2025 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై క్లయిమ్ పిటీషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు క్లయిమ్ పిటీషన్‌ను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
రాజమండ్రి **కె.జగదీష్‌కుమార్**
21-1-2025 అడ్వకేట్, రాజమండ్రి

In the Court of the Vth Addl. District Judge (MACT), E.G.Dt., Rajahmundry
M.V.O.P. No. 529/2022

Between:
1. కరాం లలితకుమారి @ మినప లలిత కుమారి మరియు అదర్స్ **-పిటీషనర్స్**
మరియు
1. కుర్ల ఆదిత్య రెడ్డి మరియు అదర్స్ **-రెస్పాండెంట్స్**

1వ రెస్పాండెంటు:
కుర్ల ఆదిత్య రెడ్డి, S/o. రాజారెడ్డి, హిందువు, వయస్సు 27 సం॥లు, Owner Cum Driver of FZS Motor Cycle bearing No: AP 39 LT 6607, R/o. D.No. 6-12, చెలుక వీధి, రంపచోడవరం మండలం, కాకవాడ గ్రామం, తూర్పుగోదావరి జిల్లా. **-రెస్పాండెంట్**

పై నెంబరు ఒ.పి.లో శ్రీ కోర్టు వారు మీకు ఎన్నిసార్లు సమన్లు పంపినను ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనక తప్పుదారి పట్టిస్తూ కాలయాపన చేయుచున్నారు. కాబట్టి సదరు రెస్పాండెంట్ వాయిదా రోజు అనగా **07-02-2025వ తేదీ ఉదయం 10.30 గంటలకు** కోర్టుకు హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

పిటీషనర్ తరపు న్యాయవాది
రాజమండ్రి **జి.శ్రీనివాస్**
తేది:24-1-2025 అడ్వకేట్, రాజమండ్రి

ముమ్మిడివరం నగర పంచాయతి

ఆర్‌ఓసి నెం. 4/2025/ఇ1 ది.29-01-2025

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

ముమ్మిడివరం నగర పంచాయతీ, ఇంజనీరింగు విభాగమునకు సంబంధించి MPLADS 2024-25 నిధులతో రెండు (2) పనులకు సిసి రోడ్లు వేయుటకు రూ. 50.00 లక్షల అంచనాలతో ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు పిలువబడినవి.

బిడ్ డాక్యుమెంట్ ప్రారంభ తేది	: 30-01-2025 ఉదయం గం॥ 11.00ల నుండి
బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ఆఖరు తేది	: 15-02-2025 సాయంత్రం గం॥ 3.00ల వరకు
బిడ్ డాక్యుమెంట్ తీసుకొనుటకు ఆఖరు తేది	: 15-02-2025 సాయంత్రం గం॥ 4.00లకు

మిగిలిన వివరముల కొరకు కార్యాలయ పని వేళలలో ఇంజనీరింగు విభాగము నందు సంప్రదించగలరు.

సం/- **కమిషనరు**, ముమ్మిడివరం నగర పంచాయతీ